TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 196   గురువారం 20-03-2025   పేజీలు : 06   వేల : 05/-

## రాష్ట్ర బడ్జెట్ రూ.3,04,965 కోట్లు




శాసనభలో పద్దును ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండలిలో ప్రతిపాదించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు కేటాయింపులిలా..పంచాయతీరాజ్ శాఖ- రూ.31,605 కోట్లు,వ్యవసాయశాఖ- రూ.24,439 కోట్లు,విద్యాశాఖ- రూ.23,108కోట్లు,మహిళా శిశు సంక్షేమశాఖ- రూ.2,862 కోట్లు,పశు సంవర్ధకశాఖ- రూ.1,674 కోట్లు,పౌరసరఫరాల శాఖ- రూ.5,734కోట్లు,కార్మికశాఖ- రూ.900 కోట్లు,ఎస్సీ సంక్షేమం: రూ40,232 కోట్లు,ఎస్టీ సంక్షేమం- రూ.17,169 కోట్లు బీసీ సంక్షేమం- 11,405 కోట్లు చేనేత రంగానికి- రూ.371 కోట్లు మైనార్టీ సంక్షేమశాఖ- రూ.3,591 కోట్లు పరిశ్రమలశాఖ- రూ.3,527 కోట్లు ఐటీ రంగం- రూ.774 కోట్లు విద్యుత్ రంగం- రూ.21,221 కోట్లు, వైద్య రంగం- రూ.12,393 కోట్లు పురపాలక రంగం- రూ.17,677 కోట్లు నీటి పారుదలశాఖ- రూ.23,373 కోట్లు రోడ్లు, భవనాల శాఖ- రూ.5,907 కోట్లు పర్యాటక రంగం- రూ.775 కోట్లు క్రీడలు- రూ.465 కోట్లు అటవీ, పర్యావరణం- రూ.1,023 కోట్లు దేవాదాయశాఖ- రూ.190 కోట్లు ఆరు గ్యారంటీలు- రూ.56,084 కోట్లు రైతు భరోసా- రూ.18వేల కోట్లు చేయూత పింఛన్లు రూ.14,861 కోట్లు ఇందిరమ్మ ఇళ్లు రూ.12,571 కోట్లు మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు గృహజ్యోతి- రూ.2,080 కోట్లు సన్నాలకు బోనస్ రూ.1,800 కోట్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ- రూ.1,143 కోట్లు గ్యాస్ సిలిండర్ రాయితీ- రూ.723 కోట్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా- రూ.600 కోట్లు రాజీవ్ యువ వికాసం- రూ.6వేలకోట్లు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు

## సంక్షేమం, అభివృద్ధి అనేవి జోడెడ్లు

### మాది జవాబుదారీతనంతో కూడిన పాలన
### ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం
### బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సంక్షేమం, అభివృద్ధి అనేవి తమ ప్రభుత్వ రథానికి జోడెడ్లలాంటివని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. వాటిని రానున్న రోజుల్లో మరింత పరుగులు పెట్టిస్తామని ఆయన తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ఆయన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... 'తెలంగాణ ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం కట్టబెట్టారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నాం. కొందరు దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ప్రతి చర్యనూ నిందిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం 2 పడక గదుల ఇళ్లు ఇస్తామని ప్రజలకు నిరాశ మిగిల్చిందని వాపోయారు. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మెగా మాస్టర్ ప్లాన్ 2050 రూపొందించాం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నాం. చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. ప్రతి మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు ఏర్పాటు చేస్తాం. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తాం. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తాం. మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి అద్దెకు 600 బస్సులు కేటాయిస్తాం. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చట్టాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ప్రవచనాలు ఎక్కువ... పైసలు తక్కువ



హైదరాబాద్: "కోట్స్ ఎక్కువ ఫాక్స్ తక్కువ.... ప్రవచనాలు ఎక్కువ పైసలు తక్కువ" అన్నట్టుగా బడ్జెట్ ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. చెప్పిన విషయాలనే పదేపదే చెప్పడం తప్ప అందులో వాస్తవాలు ఏమి లేవని తెలిపారు. అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం అరకొరా నిధులు కేటాయించిందని, కొత్త పథకాలు ఏవి కేటాయించలేదని తెలిపారు. వాస్తవిక అంచనాలతో బడ్జెట్ రూపొందించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నాడు ప్రవేశపెట్టిన బడ్జెట్ మీద ఎమ్మెల్సీ కవిత స్పందిస్తూ....తీసుకున్న రుణాలకు గాను ఈ ప్రభుత్వం గత ఏడాది కాలంగా కట్టిన వడ్డీతో సహా తిరిగి చెల్లించిన మొత్తం కేవలం రూ. 30 వేలు మాత్రమే అని బడ్జెట్ లెక్కలు స్పష్టంగా చెబుతున్నాయని, కానీ రూ లక్షా 40 వేల కోట్లు అప్పులు కట్టామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు. కెసిఆర్ గారు రాష్ట్రాన్ని హక్కుల పాలు చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్దపు ప్రచారం చేసినట్లు బడ్జెట్ పుస్తకాలు నిరూపించాయని ఎండగట్టారు. తెలంగాణ ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రం చేసిన అప్పులు మొత్తం నాలుగు లక్షల 37 వేల కోట్లు అని ప్రభుత్వమే స్వయంగా బడ్జెట్లో పేర్కొందని, మరి కెసిఆర్ గారు ఏడున్నర లక్షల కోట్లు అప్పు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా ఆరోపిస్తారని నిలదీశారు. ఇప్పటివరకు చేసిన అప్పుల్లో గత ఏడాదికాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అప్పు లక్షా 54 వేల కోట్లు ఉందని ఎండగట్టారు.కాంగ్రెస్ అసమర్థతోనే రాష్ట్రంలో కరువు: ఎమ్మెల్సీ కవితఎండల వల్లే రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. గతేడాది వర్షాలు సమృద్ధిగా పండాయని, ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వాటర్ మేనేజ్‌మెంట్ తెలియకపోవడంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా కేసీఆర్ చెరువులు నింపారన్నారు. ఎండిన పంటలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలి ఆవరణలో కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆయకట్టు కింద ఉన్న పొలాలు కూడా ఎండిపోతున్నాయన్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణా నది నుంచి 10 వేల క్యూసెక్కుల నీళ్లు ఎత్తుకుపోతుంటే చూస్తూ ఊరుకుంటున్నారని విమర్శించారు

## బి.సి రిజర్వేషన్లు పెంచడం అభినందనీయం



అసెంబ్లీలో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్ పెంపు బిల్లును రాష్ట్ర శాసనసభ ఏర్పాటు పట్ల రాష్ట్ర బి.సి ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది.ఈ మేరకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యం.చంద్రశేఖర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి రమాదేవి,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్,అసోసియేట్ ప్రెసిడెంట్ రామరాజు వర్మ,సలహాదారులు సుంకరి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు నారాయణ, యాదగిరి, సుంకరి కృష్ణ,శేషాచారి,దొంతి ప్రసన్న కుమార్,సీతారాం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి లను కలసి కృతజ్ఞతలు తెలిపారు.ఇదొక చారిత్రాత్మకమైన ఘట్టంగా వారు వర్ణిస్తూ ఇదే నిర్ణయాన్ని దేశ వ్యాప్తంగా అమలు పరిచేలా వత్తిడి తేవాలని వారు కోరారు.ఇవే రిజర్వేషన్లను ఉద్యోగ,ఉపాధ్యాయ పదోన్నతులలో కుడా అమలు పరచాలని వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు.ఈ సందర్భంగా బి.సి.ఉద్యోగుల సంఘం రూపొందించిన 2025 డైరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ,పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇది రైతు పక్షపాత ప్రభుత్వం
## నీటిపారుదల రంగానికి పెద్దపీట



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని మరోసారి రుజువు అయిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతాంగం అభివృద్ధి ప్రజల సంక్షేమాన్ని సమపాళ్లలో రంగరించి రూపొందించిన బడ్జెట్ ఇదని ఆయన అభివర్ణించారు.బుదవారం రాష్ట్ర శాసనసభలో ఆర్థిక,విద్యుత్ శాఖామంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వాగతించారు.బడ్జెట్ ప్రసంగం పై ఆయన ఒక ప్రకటనలో స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ సాదికారత, ఆహార భద్రత,స్థిరమైన అభివృద్ధి లతో పాటు నీటిపారుదల, పౌర సరఫరాలను పతిష్టవంతంగా మార్చేందుకు ఈ బడ్జెట్ ప్రతిబింబింప చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతాంగంపై మక్కువ ఎక్కువ అని చెప్పడానికి నీటి పారుదల రంగానికి 23 వేల 373 కోట్ల కేటాయింపు నిదర్శనమన్నారు.నల్గొండ జిల్లాలో లక్ష ఎకరాలకు నీరందించేందుకు గాను ఉదయ సముద్రం నుండి బ్రహ్మణ వెళ్ళేంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను పూర్తి చేయడంతో పాటు నల్లగొండ, యాదాద్రి భోనగిరి జిల్లాలోని 107 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు ఫ్లోరోసిస్ రహిత త్రాగు నీరు అందించే ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తామన్నారు.అంతే గాకుండా మూసి ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలోనీ బునాదిగాని కాలువ పునరుద్ధరణ కోసం 266.65 కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ తద్వారా యాదాద్రి జిల్లాలో పంటలు సస్యశ్యామలంగా మారనున్నాయన్నారు. కృష్ణా గోదావరి నదుల నీటి వాటాను తెలంగాణాకు సాదించేందుకు గాను ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూనే బి.ఆర్.ఎస్ పాలనలో జరిగిన అక్రమ కేటాయింపులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కఠినంగా వ్యహారిస్తూనే బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర హక్కులను బలంగా వాదించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాలు నీటి వనరుల వినియోగాన్ని గుర్తించేందుకు వీలుగా టెలిమెట్రి పరికరాలను అమర్చడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తునే దీని ద్వారా నీటి కేటాయింపులలో పారదర్శకంగా ఉండొచ్చన్నారు.

# భూమికి చేరిన సునీతా, విల్మోర్



భూమి మీదకు సునీతా విలియమ్స్, విల్మోర్ సురక్షితంగా అడుగుపెట్టారు. బుధవారం తెల్లవారుజామున ఉదయం 3.27 గంటలకు క్రూ డ్రాగన్ వ్యోమనౌక ఫ్లోరిడాలోని సముద్ర తీరంలో దిగింది. సునీతా విలియమ్స్ 9 నెలల తర్వాత అంతరిక్షం నుంచి భూమ్మీద చేరుకున్నారు. క్రూ డ్రాగన్ వ్యామనౌక ల్యాండింగ్ సక్సెస్ తో నాసా శాస్త్రవేత్తల సంబరాలు చేసుకున్నారు. సునీతా, విల్మోర్ లతో పాటు నాసాకు చెందిన కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలగ్జెండర్ గుర్బునోవ్ అంతరిక్షం నుంచి భూమి మీదకు చేరుకున్నారు. 2024 జూన్ 5న స్టార్ లైనర్ వ్యోమనౌకలో సునీత, విల్మోర్ అంతరిక్షానికి వెళ్లారు. ఆ సమయంలో వారం రోజుల్లో తిరిగి రావాల్సి ఉన్న సాంకేతిక సమస్యతో గతంలో వ్యోమనౌక స్టార్ లైనర్ ఖాళీగా తిరిగొచ్చింది. సునీత, బుచ్ విల్మోర్ 288 రోజులు అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. సునీత మూడో అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. 2006, 2012లోనూ అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన ఘనత ఆమెకే దక్కుతుంది. వ్యోమగాములు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉన్నారని నాసా ప్రకటించింది. ప్రశాంత వాతావరణం వల్ల డ్రాగన్ క్యాప్సూల్స్, ల్యాండింగ్ ఇబ్బంది కాలేదని వివరించింది. ల్యాండింగ్ సమయంలో భద్రతాపరంగా అమెరికా కోస్ట్ గార్డ్ అన్ని చర్యలు తీసుకుందని, అన్ డాకింగ్ నుంచి సాఫ్ట్ ల్యాండింగ్ వరకు అన్నీ అనుకున్నట్లు జరిగాయని సంతోషం వ్యక్తం చేసింది. స్పేస్ ఎక్స్ సంస్థ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యతో శక్తిని చాటిందని కొనియాడింది. భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలు, ప్రైవేట్ భాగస్వామ్యాలకు ఇదో సరికొత్త పద్ధతి నాంది పలికిందని మెచ్చుకుంది. క్ర్యూ-9 వ్యోమగాములు 150కి పైగా ప్రయోగాలు నిర్వహించారని, క్యాన్సర్లకు పరిష్కారాలు చూపే మార్గాలపైనా పరిశోధనలు చేశారని పేర్కొంది. వ్యోమగాముల కృషి, పరిశోధనలు భవిష్యత్ కు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించింది.

# గాజాపై మరో సారి విరుచుకుపడ్డ ఇజ్రాయిల్



పాలస్తీనా గాజాపై ఇజ్రాయిల్ యుద్ధవిమానాలు మరో సారి బాంబులవర్షం కురిపించడంతో దాదాపు 400 మంది చనిపోయారు. కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇంత భారీ ఎత్తున ఇజ్రాయిల్ విరుచుకుపడడం ఇదే ప్రథమం. జనవరిలో అమలులోకి వచ్చిన కాల్పుల విరమణ ముగిసింది. దీంతో ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు, గాజా సిటీ, దేర్ అల్ -బలా, ఖాన్ యూనిస, రఫా నగరాలలో బాంబుల వర్షం కురిపించాయి. జనం అప్రమత్తం అయ్యేలోగానే వందలాదిమంది చనిపోయారు. జనావాసాలపై బాంబుల వర్షం కురవడంతో పిల్లలతో సహా చాలామంది చనిపోయినట్లు పాలస్తీనా వైద్యశాఖ అధికారులు తెలిపారు. చాలా మంది నిరాశ్రయులయ్యారు. దాడులు చేసేందుకు ముందు ఇజ్రాయెల్ అధికారులు అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ కు సమాచారం ఇచ్చినట్లు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. అంతకు ముందే.. టెర్రరిస్ట్ చర్యలను పూర్తిగా మానుకోవాలని లేని పక్షంలో భారీ నష్టం తప్పదని డోనాల్డ్ ట్రంప్ హమాస్, ఇతర టెర్రరిస్ట్ గ్రూప్ లను, ఇరాన్ మద్దతు గల హౌతీలను హెచ్చరించారని వైట్ హౌస్ ప్రతినిధి వివరించారు. కాల్పుల విరమణ ముగియడానికి ముందే గాజాలో బందీలుగా ఉన్న 59 మంది ఇజ్రాయిలీలను విడిపించేందుకు ఇజ్రాయెల్ , హమాస్ మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు నిప్పులు కక్కాయి. ఈజిప్ట్, ఖతార్ నేతృత్వంలో అమెరికా మద్దతుతో హమాస్ తో చర్చలు జరిగినా హమాస్ బందీలవిడుదలకు ససేమిరా అందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. నెతన్యాహూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి, పదేపదే సైనిక దాడులు తప్పవని హెచ్చరిస్తూ, ఉద్దేశ పూర్వకంగానే బందీలను ప్రమాదంలోకి నెట్టారని హమాస్ ఆరోపించింది. తిరిగి దాడులకు తెగపడాలన్న ఇజ్రాయిల్ ప్రధాని నిర్ణయం.. హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారికి మరణశాసనం కాగలదని హమాస్ తీవ్రంగా హెచ్చరించింది.

# పెరూలో నెలరోజుల పాటు అత్యయిక పరిస్థితి



మా : పెరూ రాజధాని లిమాలో నెలరోజుల పాటు అత్యయిక పరిస్థితి విధించినట్లు అధ్యక్షులు డినా బోలువార్టే ప్రకటించారు. ఆదివారం ప్రముఖ గాయకుని హత్యకు నిరసనగా చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. రాజధాని సహా పలు ప్రాంతాల్లో పోలీసులతో పాటు అదనపు బలగాలను మోహరించాల్సిందిగా ఆదేశించింది. సెప్టెంబర్, డిసెంబర్ మధ్య హింసను అరికట్టేందుకు బోలువార్టే ప్రభుత్వం అత్యయిక పరిస్థితిని విధించిన సంగతి తెలిసిందే. అత్యయిక పరిస్థితి 30 రోజులు కొనసాగుతుందని అధ్యక్షులు డినా బోలువార్టే సోమవారం జారీ చేసిన ఉత్తర్వులు పేర్కొన్నాయి. ప్రభుత్వ అధికారుల సమావేశం, అసెంబ్లీ నిర్వహణ స్వేచ్ఛ సహా ఇతర హక్కులపై ఆంక్షలు విధించినట్లు తెలిపింది. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా పోలీసులు మరియు సైన్యం ప్రజలను అదుపులోకి తీసుకోవచ్చని పేర్కొంది. ఇటీవలి కాలంలో పెరూలో హత్యలు, హింసాత్మక దోపిడీలు, బహిరంగ ప్రదేశాలపై దాడులు పెరిగాయి. జనవరి 1 నుండి మార్చి 16 వరకు 459 హత్యలు జరిగినట్లు పోలీసులు ఒక నివేదికలో పేర్కొన్నారు. ఒక్క జనవరి నెలలోనే 1,909 దోపిడీలు జరిగినట్లు తెలిపింది. గత శనివారం లిమాలోని ఒక రెస్టారెంట్‌లో జరిగిన పేలుడులో 11 మంది గాయపడ్డారు. కుంబియా బ్యాండ్ అర్మోనియా 10 ప్రధాన గాయకుడు పాల్‌ఫ్లోర్స్ మార్చి 16 (ఆదివారం) హత్యకు గురయ్యారు. లిమాలో కచేరీ తర్వాత పాల్‌ఫ్లోర్స్, అతని బ్యాండ్ ప్రయాణిస్తున్న బస్సుపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పాల్‌ఫ్లోర్స్ మరణించారు. హింసాత్మక ఘటనలను అరికట్టడంలో విఫలమయ్యారంటూ అంతర్గత మంత్రి జువాన్ జోస్ శాంటివానెజ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్‌లో ప్రతిపక్ష సభ్యులు నిర్ణయించారు ఈ వారం చివర్లో జరిగే కాంగ్రెస్ ప్లీనరీలో ఓటింగ్ గురించి చర్చించే అవకాశం ఉంది.

# న్యాయస్థానంలో ట్రంప్‌కు ఎదురుదెబ్బ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనడాన్ని నిషేధించారు. అలాగే, అమెరికా మిలటరీ విభాగంలో ట్రాన్స్‌జెండర్ల నియామకాన్ని రద్దు చేశారు. ట్రంప్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలువురు ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. నిన్న జరిగిన విచారణలో ట్రంప్ నిర్ణయాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. సమానత్వ సూత్రాన్ని ఉదహరిస్తూ ట్రాన్స్‌జెండర్లపై నిషేధాన్ని న్యాయస్థానం తిరస్కరించింది. రాజ్యాంగంలోని ట్రాన్స్‌జెండర్ల హక్కులను కాలరాసే అధికారం అధ్యక్షుడి ఉత్తర్వులకు ఉన్నప్పటికీ, అది సరికాదని స్పష్టం చేసింది. సృష్టిలోని మానవులందరూ సమానమనే అమెరికా స్వాతంత్ర్య ప్రకటనను ఈ సందర్భంగా కోర్టు గుర్తు చేసింది. ట్రంప్ ఆదేశాలను నిలిపివేస్తున్నట్టు తెలిపింది.

# సమాచార సమన్వయంతో పోరాటాలకు స్ఫూర్తి




హవానా : ప్రపంచంలోని వివిధ దేశాల్లో పోరాడే ప్రజల మధ్య జరిగే సమాచార సమన్వయం పోరాటాలకు మరింత స్ఫూర్తి నిస్తుందని లాటిన్ అమెరికా దేశాల ప్రత్యామ్నాయ టెలివిజన్ ఛానల్ 'టెలిసూర్' ప్రెసిడెంట్ పట్టిసియా విజగ అన్నారు. క్యూబన్ ప్రెస్ డే సందర్భంగా ఆ దేశానికి చెందిన యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆఫ్ క్యూబా (యుపిఇసి)'పాట్రియా ఇంటర్నేషనల్ కొలోక్యూమ్ 4వ ఎడిషన్ 'అంతర్జాతీయ సదస్సును సోమవారం హవానాలో ప్రారంభమైంది. ఈ సదస్సుకు 46 దేశాల నుండి 300మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన పట్టిసియా విజగ పోరాడే ప్రజల మధ్య పరస్పర సమాచార మార్పిడి అత్యంత కీలకమని చెప్పారు. టెలిసూర్ ప్రారంభం నుండి ఈ లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. వెనిజులా మాజీ అధ్యక్షుడు ఛావెజ్ చొరవతో 2000 సంవత్సరంలో ప్రారంభమైన తమ సంస్థ 2005 నుండి కార్పొరేట్ మీడియా సంస్థల కట్టుకథలపై విస్తృతమైన పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వెనిజులాతో పాటు లాటిన్ అమెరికా అంతా విస్తరించి పోరాడే ప్రజలకు సంఘీభావంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్‌లో చోటుచేసుకున్న అకృత్యాలను, అమానుష హింసాకాండను వెలికితీసే క్రయంలో భద్రతకు సంబంధించి తీవ్రమైన సమస్యలు ఎదుర్కున్నట్లు చెప్పారు. భాషా సంబంధిత సమస్యలు వీటికి అదనమని చెప్పారు. అటువంటి అవాంతరాలు ఎన్ని ఉన్నా అధిగమించి ముందుకు సాగుతున్నట్లు ఆమె తెలిపారు. అంతర్జాతీయంగా ఈ కృషిని మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన బాధ్యత వివిధ దేశాల్లో ఉన్న ప్రత్యామ్నాయ మీడియా సంస్థలపై ఉందని చెప్పారు. తాము ప్రారంభించిన కాలంలో సాంకేతికతకు పరిమితులుండేవని, ఇప్పుడు ఎఐతో సహా ఆధునిక సాకేతికత అందుబాటులోకి వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉందని చెప్పారు. ఆమె ప్రసంగాన్ని హవానా విశ్వవిద్యాలయంకు చెందిన కమీల అనే జర్నలిజం విద్యార్థిని అంగ్లంలోకి అనువదించారు.

# నాగ్‌పూర్‌లో కొనసాగుతున్న కర్ఫ్యూ



నాగ్‌పూర్ :మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లో కర్ఫ్యూ కొనసాగుతోంది. నాగ్‌పూర్‌లో శాంతి భద్రతల పరిస్థితి అదుపులో ఉందని, పలు సమస్యాత్మక ప్రాంతాల్లో కర్ఫ్యూ కొనసాగుతోందని బుధవారం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 11 ప్రాంతాల్లో కర్ఫ్యూ కొనసాగుతోందని అన్నారు. మధ్యాహ్నం పరిస్థితిని సమీక్షించి తదుపరి ఆదేశాలు జారీ చేస్తామని పోలీస్ కమిషనర్ రవీందర్ కుమార్ సింగల్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 2,000 మందికి పైగా పోలీస్ సిబ్బందిని మోహరించామని అన్నారు. క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టి), అల్లర్ల నియంత్రణ పోలీసులు (ఆర్‌సిపి) డిసిపి ర్యాంక్ అధికారి నేతృత్వంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయని అన్నారు. హింసాకాండకు సంబంధించి 50 మందిని అదుపులోకి తీసుకున్నామని, 5 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని సీనియర్ అధికారులు తెలిపారు. ఔరంగజేబు సమాధిని కూల్చివేయాలని డిమాండ్ చేస్తూ విహెచ్‌పి, బజరంగ్‌దళ్ సోమవారం నిర్వహించిన ప్రదర్శన నాగ్‌పూర్‌లో హింసాకాండకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ హింసాకాండలో పలు వాహనాలు దగ్ధం కాగా, 34 మందికి పైగా పోలీసులు సిబ్బంది గాయపడ్డారు. పరిస్థితిని అదుపు కచేసేందుకు పలు ప్రాంతాల్లో అధికార యంత్రాంగం కర్ఫ్యూ విధించింది.

# ఆధార్‌తో ఓటర్‌కార్డు లింక్




న్యూఢిల్లీ : విశిష్ట గుర్తింపు సంఖ్య గల కార్డు ఆధార్‌తో వోటర్ కార్డు అనుసంధానానికి ఎన్నికల కమిషన్ (ఇసి) మొగ్గు చూపింది. ప్రస్తుత చట్టం, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఆధార్‌తో వోటర్ కార్డును అనుసంధానిస్తామని ఇసి మంగళవారం ప్రకటించింది. ఈ ప్రక్రియ నిమిత్తం యుఐడిఎఐ, దాని ని పుణులతో సాంకేతికపరమైన సంప్రదింపులను 'త్వరలో ప్రారంభించగలం' అని ఇసి తెలియజేసింది. వోటర్ కార్డు, ఆధార్ అనుసంధానం విషయమై ఇసి మంగళవారం కేంద్ర హోమ్ కార్యదర్శి, (న్యాయ మంత్రిత్వశాఖలోని) శాసన వ్యవహారాల కార్యదరి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, యుఐడిఎ ఐ సిఇఒలతో సమావేశం నిర్వహించింది. వోటింగ్ హక్కులు భారత పౌరునికి మాత్రమే మంజూరు చే స్తుండగా, రాజ్యాంగంలోని 326 అధికరణం ప్రకా రం ఆధార్ ఒక వ్యక్తి గుర్తింపును నిర్ధారిస్తుందని ఇసి ఒక ప్రకటనలో తెలియజేసింది.'అందువల్ల రాజ్యాంగం 326 అధికరణం, 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్లు 23(4), 23(5), 23(6) నిబంధనల ప్రకారం, (2023 నాటి) సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఆధార్‌తో వోటర్ ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్)ను అనుసంధానించాలని నిర్ణయించడమైంది' అని ఇసి వివరించింది. తదనుగుణంగా యుఐడిఎఐ, ఇసి సాంకేతిక నిపుణుల మధ్య సాంకేతికపరమైన సంప్రదింపులు 'త్వరలో ప్రారంభం కానున్నాయి' అని ఇసి తెలియజేసింది. ఆధార్ డేటాబేస్‌తో వోటర్ల జాబితాల ఐచ్ఛిక అనుసంధానాన్ని చట్టం అనుమతిస్తున్నది. కాగా, ఆధార్ వోటర్ కార్డు అనుసంధానం ప్రక్రియకు ఎటువంటి లక్ష్యాన్ని లేదా కాలపరిమితులను నిర్దేశించలేదరి ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. తమ ఆధార్ వివరాలను వోటర్ల జాబితాతో అనుసంధానం చేయనివారి పేర్లను వోటర్ల జాబితాల్లో నుంచి తొలగించడం జరగదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎన్నికల శాసనాలు (సవరణ) చట్టం 2021 ద్వారార సవరించిన ప్రకారం 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 23 కింద ఐచ్ఛికంగా గుర్తింపును నిర్ధారించేందుకు ఆధార్ కార్డు చూపాలని ప్రస్తుత లేదా రాబోయే వోటర్‌ను వోటర్ల నమోదు అధికారులు కోరడానికి వీలు కల్పిస్తోంది.

# పార్లమెంటు ఎదుట డిఎంకె నిరసన



న్యూఢిల్లీ : డీలిమిటేషన్ అంశంపై ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) పార్లమెంటు ఎదుట బుధవారం ఆందోళన చేపట్టింది. డిఎంకె ఎంపిలు కనిమొళి, టి.శివ, దయానిధి మారన్‌లు ఆందోళనలో పాల్గొన్నారు. న్యాయమైన డీ లిమిటేషన్ అని రాసిన బ్యానర్‌ను ప్రదర్శించారు. డీలిమిటేషన్‌ను డిఎంకె తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. పార్లమెంటు వేదికగా గత కొన్ని రోజులుగా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. మార్చి 10న ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సెషన్ ఏప్రిల్ 14 వరకు కొనసాగనుంది. డీలిమిటేషన్ 'సమాఖ్యవాదంపై బహిరంగ దాడి'గా తమిళనాడు సిఎం స్టాలిన్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈచర్యకు వ్యతిరేకంగా ఐక్య రాజకీయ ఫ్రంట్‌కు పిలుపునిచ్చారు. మార్చి 8న స్టాలిన్ ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాలు సహా ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. ఈ అన్యాయమైన చర్యకు వ్యతిరేకంగా పోరాటంలో తనతో చేరాలని లేఖలో పేర్కొన్నారు. కేరళ సిఎం పినరయి విజయన్, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబునాయుడు, పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ, ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాంఝీ సహా ఆయా రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కోరారు.

# సెల్ ఫోన్లు అందించిన నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణ పేట ప్రతినిధి (మన వెలుగు) మార్చ్ 19 :**సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు బుధవారం నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ సెల్ ఫోన్లు అందించారు, మొత్తం సుమారుగా 7 లక్షల విలువ గల సెల్ ఫోన్లు 47 మందికి అందించారు,ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఎవరైనా తమ విలువైన స్మార్ట్ఫోన్లను పోగొట్టుకుంటే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.పోగొట్టుకున్న సెల్ఫోన్లను సి ఈ ఐ ఆర్ ద్వారా ట్రాప్ చేసి ఫోన్లను రికవరీ చేస్తామని, మరియు సెల్ ఫోన్ దొంగతనం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్పీ స్టేషన్ ఎస్ఐలకు తెలిపారు,ఇట్టి కార్యక్రమంలో నారాయణ పేట జిల్లాలోని వివిధ మండల పోలీస్ స్టేషన్ లో పనిచేసే సీఐ లు మరియు ఎస్ ఐ లు సెల్ ఫోన్లు పోగుట్టుకొని తిరిగి పొందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ను
## ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) మార్చి 19 :** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ను సందర్శించి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని పరిసరాల ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్ధవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా పెడుతూ విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉంటూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పని చేయాలని తెలియజేశారు. ఎస్పీ వెంట ఎస్.ఐ అనిల్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# కరీంనగర్ బల్దియాపై కాషాయ జెండా ఎగురవేద్దాం



**కరీంనగర్ (మన వెలుగు) మార్చి 19 :** కరీంనగర్ నగరపాలక సంస్థపై కాషాయ జెండా ఎగర వేసేందుకు సిద్ధం కావాలని , ఆ లక్ష్యంతో కార్పొరేషన్ లోని బిజెపి శ్రేణులంతా సమిష్టి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రోజున కరీంనగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో బిజెపి కరీంనగర్ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగర అభివృద్ధి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో జరిగిందని, పట్టణ ముఖచిత్రం మార్చడానికి కేంద్ర ప్రభుత్వం వందల కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ చొరవతోనే స్మార్ట్ సిటీ నిధులు వచ్చాయని, కరీంనగర్లో అమృత్ పథకం కింద 24 గంటల మంచినీటి సదుపాయాన్ని తీసుకువచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వందేనన్నారు. కరీంనగర్ పట్టణం కోతి రాంపూర్ ప్రజలకు ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిన డంపింగ్ యార్డ్ సమస్య విముక్తి కోసం కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు .కరీంనగర్ పట్టణ అభివృద్ధికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని , కరీంనగర్ పట్టణానికి స్మార్ట్ సిటీ హోదా ఇచ్చి , వందల కోట్ల నిధులు అందించి , నేడు పట్టణ ముఖచిత్రాన్ని మార్చిందన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధి కి బిజెపి కట్టుబడి ఉందని , ఇన్నేళ్లుగా కరీంనగర్లో జరిగిన అభివృద్ధి మోడీ ప్రభుత్వ నిధులతోనేన్న విషయం నగర ప్రజలందరికీ అర్థమైందన్నారు. అందుకే కరీంనగర్ పట్టణ ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని, నగరపాలక సంస్థపై కాషాయం జెండా ఎగరవేయడానికి తాజా మాజీ కార్పొరేటర్లు , పార్టీ శ్రేణులందరూ తగిన కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగురవేస్తే కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సారథ్యంలో నగరం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అందుకే ఆ దిశలో భవిష్యత్తు కార్యాచరణ కోసం 21న కరీంనగర్లో ముఖ్యమైన సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సునీల్ రావు, డి .శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు , మాజీ ఎంపీపీ వాసాల రమేష్, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, అసెంబ్లీ కన్వీనర్ దుబ్బాల శ్రీనివాస్, కరీంనగర్ నగర జోన్ బాధ్యులు, అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్



**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) మార్చి 19 :** బుధవారం మేడిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తన సిబ్బంది చైతన్య,అనిల్,సాదు నాయక్ లతో పాటు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామ శివారులో చెరువు కట్ట సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారు. మొత్తం ఏడుగురు వ్యక్తుల పైన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి పేకాట ఆడిన వారి వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు, 2 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ మరియు 12 వేల 5 వందల నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి





**గొల్లపెల్లి (మన వెలుగు) మార్చి 19 :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం మల్లన్న పేట గ్రామం లో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లన్న పేట పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ...రాబోయే పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి అత్యుత్తమ ఫలితాలు పొందాలని కోరారు.విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్య సాధన దిశగా విద్యా ర్థులు కష్టపడి భవిష్యత్తులో అత్యున్నత స్థానాన్ని చేరుకో వాలని ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాము విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మండల విద్యాధికారి బూస జమునా దేవి, సెక్టోరల్ అధికారులు చిప్ప సత్యనారాయణ, కొక్కుల రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు అమర్ నాథ్ రెడ్డి, కరుణాకర్, సుధాకర్, రాజేశం, హరికృష్ణ, సత్య, రవీందర్, బాలచంద్రుడు, కుమారస్వామి, చంద్రశేఖర్, శరత్ చందర్, విజయ, స్రవంతి, నందయ్య, రాజ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల
## రెండు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వండి




**కరీంనగర్ (మన వెలుగు) మార్చి 19 :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల రెండు నెలలు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, లేదంటే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు పనులు బంద్ పెట్టి సమ్మెలోకి వెళ్తామని, మరియు కార్మికులతో బాత్రూం %ఁ% టాయిలెట్స్ పనులు చేపించవద్దని దీనికోసం స్కావెంజెర్ను నియమించాలని తదితర డిమాండ్స్ తో ఈ రోజు ప్రభుత్వ ఆస్పుటల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుసిసి ) ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ వీర రెడ్డి గారికి సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టియుసిసి జాతీయ కమిటీ సభ్యులు, ప్రభుత్వ ఆస్పుటల్ వర్కర్స్,ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బండారి శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్ మరియు ప్లంబర్ కార్మికులు దాదాపు 250 మంది కార్మికులు పనిచేస్తున్నారని, కార్మికులకు జీతాళ్లు ఇవ్వకుండాకాంట్రాక్టర్, వైద్య అధికారులు ఇబ్బందులకు గురించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి గత రెండు నెలలుగా జీతాలు రావడం లేదని. కార్మికులకు ప్రతి నెల 5వ తేదీ లోపు పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలని అనేక సార్లు విన్నవించిన పెడచెవిన పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి 542 బెండ్లకు బిల్ సాంక్షన్ చేస్తూ జీవో 29/03/2025 నెం. 694 ఇవ్వడం జరిగింది. జిఓ నెం 694 ఇచ్చి మళ్ళీ 330 బెండ్లకే బిల్ ఇవ్వడం వలన కార్మికులకు జీతాలు పెండింగ్ లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏద్దావా చేశారు.ఈ సమస్యపై హైదరాబాద్ లోని డియంఈ, కరీంనగర్ జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్ మరియు ఏజిల్ సంస్థ యజమాన్యానికి దరఖాస్తులు కూడా పెట్టినాము. అయిన కూడా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. తప్పని పరిస్థితులలో సమ్మె నోటీస్ ఇవ్వవలసి వచ్చిందని ఏప్రిల్ 4 నుండి కార్మికులు పనులు బంద్ పెట్టి సమ్మెలోకి పోతారని తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ప్రభుత్వాసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి.అరుణ్, కార్యదర్శి పి.కళావతి కార్మికులు రాజు, అనిల్, బాలయ్య, మహేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు అందజేత




**ములుగు (మన వెలుగు) మార్చి 19 :** సరెండర్ – కమ్ – రిహాబిలిటేషన్ లో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ ముందు లొంగిపోయిన ప్రభుత్వ నిషేదిత సి.పి.ఐ మావోయిస్ట్ పార్టీ నేషనల్ పార్క్ ఏరియా కమిటీ కి చెందిన సభ్యురాలు అయిన అలువ స్వర్ణ అలియాస్ స్వర్ణక్క (50), పుల్సం పద్మ అలియాస్ ఊరే అలియాస్ గంగక్క(డివిసిఎం), దివంగత కటకం సుధర్శన్ అలియాస్ ఆనంద్ (సెంట్రల్ కమిటీ సభ్యుడు – సీసీఎం, పొలిట్బ్యూరో సభ్యుడు – పిబిఎమ్) యొక్క భార్య (52) సంవత్సరాలు, జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రభుత్వం తరపున వారికి అందవలసిన రివార్డును అందజేశారు. వారిలో అలువ స్వర్ణ అలియాస్ స్వర్ణక్క కు 4 లక్షల విలువ కలిగిన డిడిని మరియు పుల్సం పద్మ అలియాస్ ఊరే అలియాస్ గంగక్క(డివిసిఎం) కు 5 లక్షల విలువ కలిగిన డిడిని అందజేశారు. వారికి భవిష్యత్తులో ఏ అవసరం కలిగిన ప్రభుత్వం తరపున అండగా ఉంటామని, సహకరిస్తామని పేర్కొన్నారు.ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, మావోయిస్టు సిద్ధాంతంతో పనిచేస్తున్న సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన అందరూ ప్రభుత్వం యొక్క సరెండర్ కం రిహాబిలిటేషన్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరియు సమాజంలో ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి జనజీవన స్రవంతిలో చేరాలని తెలిపారు.

మన వెలుగు
TEL:T/TG/2024/0814
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY




## నాగ్‌పూర్‌లో కర్ఫ్యూ..డిసిపిలు సహా పలువురికి గాయాలు



**నాగ్‌పూర్ :** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో చేపట్టిన నిరసన హింసాకాండకు దారితీయడంతో పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించినట్లు పోలీస్ అధికారులు మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం చెలరేగిన హింసాకాండలో ముగ్గురు డిసిపిలు (డిప్యూటీ కమిషనర్స్ ఆఫ్ పోలీస్) సహా 12 మంది పోలీస్ సిబ్బంది గాయపడ్డారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. హింసాకాండకు సంబంధించి 15 మందిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. కొత్వాలి, గణేష్ పేట్, తహసీల్, లకడ్‌గంజ్, పచ్‌పవోలి, శాంతినగర్, సక్కర్దార, నందన్‌వన్, ఇమాంబాడా, యశోధర నగర్, కపిల్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ విధించినట్లు ప్రకటించారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని ధ్వంసం చేయాలంటూ సోమవారం సాయంత్రం భజరంగ్ దళ్ కార్యకర్తలు చేపట్టిన ఆందోళన హింసకు దారితీసింది. ఒక వర్గానికి చెందిన పవిత్రగ్రంధాన్ని దగ్ధం చేసినట్లు పుకార్లు వ్యాపించడంతో పోలీసులపై రాళ్లు రువ్వారని అధికారులు తెలిపారు. ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హన్సపురి ప్రాంతంలో రాత్రి 10.30 నుండి 11.30 గంటల మధ్య మరో ఘర్షణ జరిగింది. అల్లరిమూకలు పలు వాహనాలను తగులబెట్టారు. ఆ ప్రాంతంలో ఒక నివాసాన్ని, క్లినిక్‌ను కూడా ధ్వంసం చేశారు.

## వక్ఫ్ బిల్లుపై తప్పుదారి పట్టిస్తున్నారు




**న్యూఢిల్లీ :** వక్ఫ్ చట్టానికి ప్రతిపాదిత సవరణలపై ముస్లింలను ప్రతిపక్షాలు 'తప్పుదారి పట్టిస్తున్నాయి' అని బిజెపి సోమవారం ఆరోపించింది. బిల్లు పార్లమెంట్ ఆమోదముద్ర పొందినట్లయితే స్పష్టమైన టైటిళ్లు ఉన్న వక్ఫ్ ఆస్తుల్లో 'ఒక్క అంగుళమైనా' పరాధీనం కాదని బిజెపి స్పష్టం చేసింది. అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి) సారథ్యంలో పలు ముస్లిం సంస్థలు ఢిల్లీలో వక్ఫ్ (సవరణ) బిల్లుపై నిరసన ధర్నాలో పాల్గొన్న నేపథ్యంలో బిజెపి ఆ ఆరోపణ చేసింది. పలువురు ఎంపిలు ధర్నాలో పాల్గొన్నారు. బిల్లుకు మద్దతు ఇచ్చిన పక్షంలో ముస్లింలు ఎన్నటికీ క్షమించబోరని ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు టిడిపి. జెడి (యు), ఎల్‌జెపి(రామ్‌విలాస్)లను ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ హెచ్చరించారు. ఆ ధర్నాపై వ్యాఖ్యానించవలసిందని మీడియా కోరినప్పుడు బిజెపి ఎంపి తేజస్వి సూర్య స్పందిస్తూ, 'దేశంలో వోటు బ్యాంకు రాజకీయాలు భయం ఆధారంగానే ఎల్లప్పుడూ సాగుతున్నాయి. సెక్యులర్ పార్టీలుగా చెప్పుకుంటున్నవి అనుసరించే పద్ధతే అది' అని అన్నారు. 'వక్ఫ్ ఆస్తుల యాజమాన్యంలో ప్రొఫెషనలిజాన్ని, మేలైన నిర్వహణను, పారదర్శకతను తీసుకురావడమే వక్ఫ్ బిల్లును తేవడంలో ప్రభుత్వ ఉద్దేశం అని ప్రతి ఒక్కరికీ హామీ ఇస్తున్నాను' అని తేజస్వి సూర్య ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో విలేకరుల గోష్ఠిలో చెప్పారు. వక్ఫ్‌కు చెందని భూముల ఆక్రమణకు వక్ఫ్ బోర్డు అధికారాల దుర్వినియోగం చెందకుండా ప్రభుత్వం చూసిందని ఆయన తెలిపారు. 'స్పష్టమైన టైటిళ్లు ఉన్న అన్ని సంస్థలు, ఏళ్ల తరబడి ఉనికిలో ఉన్న అన్ని ప్రార్థనా స్థలాలలో ఏ ఒక్కదానికీ కొత్త వక్ఫ్ చట్టం గురించి భయం ఉండరాదు' అని సూర్య అన్నారు. ముస్లింలను తప్పుదారి పట్టించే యత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు, 'అటువంటి భూముల్లో ఒక్క అంగుళం పరాధీనం కాదు' అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాలపై సూర్య విరుచుకుపడుతూ, సెక్యులర్ పార్టీలుగా చెప్పుకుంటున్నవి ముస్లింల కోసం ఏమీ చేయలేదని, అవి వారిని బెదరగొట్టే, తప్పుదారి పట్టించే యత్నాలే చేశాయని ఆరోపించారు. 'వక్ఫ్ బోర్డులను మరింత పటిష్ఠం చేయడమే ప్రభుత్వ ఉద్దేశం' అని సూర్య చెప్పారు.

## మాజీ కేంద్ర మంత్రి దేవేంద్ర ప్రధాన్ కన్నుమూత



బిజెపి నేత, మాజీ కేంద్ర మంత్రి దేవేంద్ర ప్రధాన్(84) సోమవారం కన్నుమూశారు. ఆయన అటల్ బిహారీ వాజ్‌పేయి హయాం ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఆయన మూడుసార్లు ఒడిశా బిజెపి అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రధాన్‌కు ఇద్దరు కుమారులు. న్యూఢిల్లీలోని తీన్‌మూర్తి వీధిలోని తన కుమారుడి అధికార నివాసంలో ఆయన చివరి శ్వాసను వదిలారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు. కాగా ప్రధాని నరేంద్ర మోడీ, దేవేంద్ర ప్రధాన్ మృతదేహానికి పుష్పాంజలి ఘటించి, ఆయన ఒడిశాలో బిజెపి బలపడ్డానికి ఎంతో కృషిచేశారని కీర్తించారు. అంతేకాక ఆయన ఎంపీగా బాగా కృషి చేసేవారని, దారిద్ర్య నిర్మూలనకు, సామాజిక స్వాధికారతకు పాటుపడ్డారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతున్నాను అంటూ ఎక్స్ పోస్ట్ పెట్టారు. తీన్‌మూర్తి లేన్‌లోని ఆయన నివాసానికి అనేక మంది కేంద్ర మంత్రులు వెళ్లి నివాళులర్పించారు. దేవేంద్ర ప్రధాన్ 1998 లోక్‌సభ ఎన్నికల్లో దేవ్‌గఢ్ నుంచి తొలిసారి ఎన్నికయ్యారు. 1999 నుంచి 2001 వరకు కేంద్ర రవాణ, వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన పనిచేశారు. ఒడిశా ప్రగతికి ఆయన ఎంతో పాటుపడ్డారని గవర్నర్ హరిబాబు కంభంపాటి కీర్తించారు. ఆయన మృతదేహాన్ని సాయంత్రం ఢిల్లీ నుంచి భువనేశ్వర్‌కు తీసుకొస్తారని కుటుంబసభ్యులు తెలిపారు.

## మళ్లీ మారుతీ సుజుకీ ధరల పెంపు

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మరోమారు తమ వాహన ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి తమ వాహన ధరలను 4 శాతం వరకు పెంచాలని నిర్ణయించినట్లు ఆ కంపెనీ సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీంతో గత రెండు నెలల్లో ఇది రెండోసారి పెంపు కావడం గమనార్హం. తయారీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ వ్యయాల భారాన్ని కొంతభాగం వినియోగదారులకు బదిలీ చేయడం మినహా వేరే మార్గం లేదని ఆ కంపెనీ పేర్కొంది. ఈ కంపెనీ ప్రాథమిక మోడల్ ఆల్టో కె-10 నుంచి ఇన్విక్టో మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరల శ్రేణి రూ.4 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు ఉంది. ఇంతక్రితం మోడళ్లను బట్టి గరిష్ఠంగా రూ.32,500 వరకు పెంచేసింది. తాజా పెంపునతో కొనుగోలుదారులపై మరింత భారం పడనుంది.

## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో నకిలీ ఉత్పత్తులు

ఇ-కామర్స్ సంస్థల్లో నకిలీ ఉత్పత్తులు, ప్రామాణికత లేని ఉత్పత్తులపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఎట్టకేలకు దృష్టి పెట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజ ఆన్‌లైన్ విక్రేతలకు చెందిన గిడ్డంగులపై బిఐఎస్ దాడులు చేసి వేలాది ధృవీకరించని ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మార్చి 7న లక్నో, గురుగావ్, ఢిల్లీలోని ఇ-కామర్స్ గిడ్డంగులపై బిఐఎస్ దాడులు నిర్వహించింది. లక్నోలోని అమెజాన్ గిడ్డంగి నుండి 215 బొమ్మలు, 24 హ్యాండ్ బ్లెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని బిఐఎస్ సర్టిఫికేషన్ లేకుండా విక్రయిస్తున్నారు. ఫిబ్రవరి 2025లో గురుగావ్‌లోని అమెజాన్ గిడ్డంగిపై జరిగిన దాడిలో 58 అల్యూమినియం ఫాయిల్స్, 34 మెటాలిక్ వాటర్ బాటిళ్లు, 25 బొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పివిసి కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లిప్‌కార్ట్ గురుగావ్ గిడ్డంగిలో జరిపిన సోదాల్లో సర్టిఫికెట్లు లేని 534 స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు, 134 బొమ్మలు, 41 స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. బిఐఎస్ గుర్తింపు లేని ఉత్పత్తులను ఆయా సంస్థల్లో నిరంతరం విక్రయించడంపై ఫిర్యాదులు అందిస్తోన్న నేపథ్యంలో సోదాలు చేసినట్లు సమాచారం.

## నాలుగు నిషేధిత సంస్థల సభ్యుల అరెస్ట్

**ఇంఫాల్:** మణిపూర్‌లో గడిచిన 24 గంటల్లో నిషేధిత సంస్థలకు చెందిన నలుగురు ఉన్నత స్థాయి అధికారులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఇంఫాల్ వెస్ట్ మరియు బిష్ణుపూర్ జిల్లాల నుండి వారిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని లాంగోల్ గేమ్ విలేజ్ జోన్ 11 నుండి నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన లౌరెంబమ్ బ్రోజెన్ సింగ్ (50)ని అరెస్ట్ చేసినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అదే జిల్లా నుండి నిషేధిత ప్రేపాక్ /ఉప్క్ సభ్యుడు రోమియో సింగ్, కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (పిబ్ల్యుజి) కేడర్ లైష్రామ్ టోంబాలను అరెస్ట్ చేశామని అన్నారు. బిష్ణుపూర్ జిల్లా నుండి పిడబ్ల్యుజి మరో కేడర్ ఖుంద్రక్‌పామ్ మైఖేల్‌లను అరెస్ట్ చేశామని అన్నారు. ఒక 9 ఎంఎం పిస్టల్, ఒక ఖాళీ మేగజైన్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి వద్ద భద్రత పెంపు




ఛత్రపతి శంభాజీనగర్: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని కూల్చేయాలని కొందరు డిమాండ్ చేస్తుండడంతో పోలీసులు, అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. మహారాష్ట్రలోని శంభాజీనగర్ జిల్లా ఖుల్దాబాద్‌లో ఉన్న ఔరంగజేబు సమాధి వద్దకు వెళ్లే సందర్శకులపై ఆంక్షలు విధించారు. ఇకపైన అక్కడికి ఎవరైనా వెళితే రిజిస్టర్‌లో సంతకం చేయడంతో పాటు, ఐడి కార్డును చూపించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద విహెచ్‌పి కార్యకర్తలు నిరసనలు చేపట్టి, ఔరంగజేబు సమాధిని నిర్మూలించాలంటూ మెమోరాండంలు సమర్పించారు. ఔరంగజేబు రాజ్యవిస్తరణను మరాఠులు గట్టిగా అడ్డుకున్నారన్నది ఇక్కడ గమనార్హం. ఇదిలావుండగా ఖుల్దాబాద్‌కు వెళ్లే దారిలో అనేక చోట్ల సెక్యూరిటీ పోస్టులను ఛత్రపతి శంభాజీనగర్ రూరల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటుచేసింది. సమాధి, తదితర ప్రాంతాల్లో 50 మంది సిఆర్‌పి, 30 మంది స్థానిక పోలీసులు, 20 హోంగార్డులను మోహరించారు. సమాధిని సందర్శించే పర్యాటకులు రిజిష్టరులో తమ పేరు వివరాలు రాయడమేకాక, ఐడి కార్డును చూయించాల్సి ఉంటుంది. కాగా 'ఇక్కడ వాతావరణం ప్రశాంతంగానే ఉంది. ప్రజలు వదంతులను నమ్మకూడదు. ఔరంగజేబు సమాధిని నిర్మూలించాలని డిమాండ్ మొదలయినప్పటి నుంచి పర్యాటకుల సందర్శన సంఖ్య ఇంకా బాగా పెరిగింది' అని సమాధి కేర్‌టేకర్ పర్వేజ్ కబీర్ అహ్మద్ తెలిపారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే 'మతమార్పిడికి అంగీకరించకపోవడంతో ఔరంగజేబు సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ ఇద్దరు కుమారులను చంపించాడు, మరాఠా యోధుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను చిత్ర హింసలు పెట్టి చంపాడు. అంతేకాక కాశీ, మథుర, సోమ్‌నాథ్‌లోని అనేక మందిరాలను కూల్చేశాడు' అంటూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సమర్పించిన మెమోరాండంలో విహెచ్‌పి పేర్కొంది. 'ఔరంగజేబుకు సంబంధించిన ఎలాంటి చిహ్నం అయినా బాధాకరమే' అని కూడా పేర్కొంది.

## తోబుట్టువులు, బంధువులు అంతా 'బహుజన్ సమాజ్' భాగస్తులే



లక్నో: తన తోబుట్టువులు, బంధువులు అంతా 'బహుజన్ సమాజ్ 'భాగస్తులేనని ఆ పార్టీ చీఫ్ మాయావతి సోమవారం అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ 'ఎవరైనా సరే బహుజన్ సమాజ్(బిఎస్‌పి) కోసం పనిచేస్తే వారిని ప్రమోట్ చేస్తాను, ఇందులో బంధుత్వం ఏదీ అడ్డు రాదు' అన్నారు. 'నేను బతికి ఉన్నంత వరకు పార్టీని తోబుట్టువులు, బంధువులు బలహీనపరచడాన్ని ఆమోదించను. నా తోబుట్టువులు, బంధువులు కేవలం పార్టీ భాగస్తులే. ఆమె తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ అన్ని పదవుల నుంచి తప్పించడంతో, ఆమె తాజా వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. దేశవ్యాప్తంగా బిఎస్‌పి వ్యవహారాలు చూసుకునేందుకు మాయావతి తన సోదరుడు ఆనంద్ కుమార్, రామ్జీ గౌతమ్‌లను జాతీయ కోఆర్డినేటర్లుగా నియమించారు. ప్రధాని నరేంద్ర మోడీ గురించి మాట్లాడుతూ ఆమె 'ప్రధాని ఎప్పుడూ తాను పేదరికాన్ని అనుభవించానని చెప్పుకుంటారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అంతంత మాత్రమే



15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల తక్కువగా ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానంలో స్పష్టమైంది. 2021-22లో రూ.21,342.43 కోట్లు, 2022-23లో రూ.13,174.27 కోట్లు, 2023-24లో 9,640.84 కోట్లు, 2024-25లో రూ.3,989.72 కోట్లు విడుదల చేశారు. అందులో పట్టణ స్థానిక సంస్థలకు 2021-22లో రూ.956 కోట్లు కేటాయించగా, రూ.1,157.35 కోట్లు విడుదల చేశారు. 2022-23లో రూ.990 కోట్లు కేటాయించగా, రూ.735.75 కోట్లు విడుదల చేశారు. 2023-24లో రూ.1,046 కోట్లు కేటాయించగా, రూ.984.55 కోట్లు విడుదల చేశారు. 2024-25లో రూ.1,109 కోట్లు కేటాయించగా, రూ.305.05 కోట్లు విడుదల చేశారు. మొత్తం నాలుగేళ్లలో రూ.4,101 కోట్లు కేటాయిస్తే, రూ.3,182.7 కోట్లు విడుదల చేశారు. గ్రామీణ స్థానిక సంస్థలకు 2021-22లో రూ.1,939 కోట్లు కేటాయించగా, రూ.969.50 కోట్లు విడుదల చేశారు. 2022-23లో రూ.2,010 కోట్లు కేటాయించగా, రూ.948.35 కోట్లు విడుదల చేశారు. 2023-24లో రూ.2,031 కోట్లు కేటాయించగా, రూ.3,974.19 కోట్లు విడుదల చేశారు. 2024-25లో రూ.2,152 కోట్లు కేటాయించగా, రూ.2,109.97 కోట్లు విడుదల చేశారు. మొత్తం నాలుగేళ్లలో రూ.8,132 కోట్లు కేటాయిస్తే, రూ.8,002.01 కోట్లు విడుదల చేశారు.

## స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ప్రారంభం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం గడిచిన సెషన్‌లోని ముగింపుతో పోలిస్తే లాభాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 9:19 సమయానికి నిఫ్టీ 106 పాయింట్ పెరిగి 22,612 కు చేరింది. సెన్సెక్స్ 321 పాయింట్లు పెరిగి 74,487 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 103.52 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 71.25 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.28 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.65 శాతం పెరిగింది. నాస్‌డాక్ 0.31 శాతం పుంజుకుంది. స్టాక్ మార్కెట్ స్థిరీకరణలో భాగంగా సోమవారం మిడ్ క్యాప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా, చిన్న షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. డాలర్ ఇండెక్స్ బలహీనత, దేశీయ ఈక్విటీ మార్కెట్లో కొనుగోళ్ల దన్నుతో డాలర్ మారకంలో రూపాయి విలువ 24 పైసలు పెరిగి 86.81 వద్ద స్థిరపడింది. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకల నేపథ్యంలో 'బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది' అంటూ ఆర్‌బీఐ భరోసాతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు కోలుకుంది. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఎస్అండ్‌పీ సూచీ 0.65 శాతం, నాస్‌డాక్ 0.31 శాతం, డోజోన్స్ 0.85 శాతం లాభపడ్డాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. జపాన్ నిక్కీ, హాంకాంగ్ హాంగెసెంగ్ 1 శాతం మేర లాభంతో కదలాడుతుంటే.. షాంఘై, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ మాత్రం బలహీనంగా ట్రేడవుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు మంగళవారం నికరంగా రూ.4,488 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.6,001 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు.

# దివ్యాంగులకు చేయూత మానవ ధర్మం



అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 3వ ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా ఉండేది. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగులు ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవంను జరుపుకునేవారు. గతంలో యుద్ధాలలో వికలాంగులైన సైనికులు మాత్రమే ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారము నాడు వికలాంగుల దినోత్సవము జరుపుకునేవారు. దానిని ఐక్యరాజ్య సమితిలో ఆమోదించి అన్ని రకాలుగా వికలాంగులైన వారందరు ప్రపంచ యావత్తు ఈ వేడుకలను నిర్వహించు కోవాలని ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారాన్ని "ప్రపంచ వికలాంగుల దినోత్సవము"గా ప్రకటించ బడినది. అలాగే 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరముగా ఐక్యరాజ్య సమితి ప్రకటించటం, ఆ సంవత్సరములో ఎన్నో కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో 1976లో ఐక్యరాజ్య సమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది. అలాగే, 1983 నుండి 1992 వరకు ఐక్యరాజ్య సమితి వికలాంగుల దశాబ్దంగా ప్రకటించింది. ఎన్నో వర్గాల వారికి అనగా కార్మికులకు మేడే - మే 1వ తేదీన, పిల్లలకు చిల్డ్రన్ స్డే నవంబర్ 14వ తేదీన, మహిళలకు ఉమెన్స్ డే మార్చి 8వ తేదీన చివరకు ప్రేమికులకు వాలెంటైన్స్ డే ఫిబ్రవరి 14వ తేదీన ఇలా ప్రతిదానికి ఒక నిర్దిష్టమైన తేది ఉంటే వికలాంగులకు మాత్రం నిర్దిష్టమైన తేదీ లేకుండేది. మార్చి 3వ ఆదివారం "ప్రపంచ వికలాంగుల దినోత్సవము" జరుపడం వలన ప్రతి సంవత్సరము ఏదో ఒక తేదీన రావడం వలన ఫలాన తేది నాడు వికలాంగుల దినోత్సవము అని గుర్తించ లేకపోవడం జరిగినది. ఈ విషయమై 1994వ సంవత్సరము మొదటిలోనే ఐక్యరాజ్య సమితిలో మరొక పర్యాయం చర్చించి మార్చి 3వ ఆదివారం నాడు జరుపుతున్న "ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని" 1994 నుండి డిసెంబర్ 3వ తేదీనాడు "అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవముగా" జరపాలని ప్రకటించ బడినది. ఆ నాటి నుండి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ప్రతి సంవత్సరము డిసెంబర్ 3వ తేదీనాడు యావత్తు ప్రపంచములో నిర్వహించ బడుచున్నవి. 1995 వికలాంగుల హక్కుల చట్టం వచ్చినప్పటి నుండి వికలాంగుల సంక్షేమము మరియు అభివృద్ధి కై పలు పథకాలు ప్రవేశ పెట్టబడినవి. వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడంకోసం 1992లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవం మొదలై,1998 నుండి ప్రతి సంవత్సరం వికాలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1981లో ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సహకార సంస్థ ఏర్పాటు చేయడం, తరువాత 1983లో వికలాంగుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. వాస్తవానికి ఆంగ్ల భాషలో హ్యాండి క్యాప్ డ్, డిజేబుల్డ్, ఫిసికల్లీ ఛాలెంజ్డ్ అని రక రకాల పదాలు వాడుతున్నా, తెలుగులో అంగవికలులను "వికలాంగులు" కాకుండా "దివ్యాంగులు"గా పేర్కొనడం సమంజసంగా భావించి, సాధ్యమైనంత వరకూ వికలాంగులు అనే పదం వాడుక భాషలో తీసేసి, అలాగే దివ్యాంగులు పదమే వాడుతున్నారు. సమాజంలోని దివ్యాంగుల పట్ల స్వాభావిక గౌరవం, వ్యక్తిగత స్వయం ప్రతిపత్తి, వివక్షత లేని సమాజం, అవకాశాల సమానత్వం, అవరోధ రహిత వాతావరణం నిర్మాణం కొరకు, దివ్యాంగుల హక్కులకు కలుగ జేయడానికి కేంద్ర ప్రభుత్వం 2016లో దివ్యాంగుల హక్కుల చట్టాన్ని రూపొందించింది.దీన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడానికి గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల నియమాలు 2018లో రూపొందించారు. ఈ చట్టంలో భాగంగా దివ్యాంగులకు అన్ని రంగాలలో సమానత్వం కల్పించడానికి ప్రత్యేక హక్కులతో పాటు 5% రిజర్వేషన్ కల్పించారు. వారి స్వాలంబనకై తెలంగాణ రాష్ట్రం లో తెలంగాణ ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేని విధంగా సుమారు ఏడు లక్షల 30 వేల దివ్యాంగులకు ప్రతి నెల మూడు వేల పదహారు రూపాయలు పెన్షన్లు ఇవ్వడం జరుగుతున్నది. అలాగే వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో వెళ్లడానికి అవరోధ రహిత వాతావరణం కల్పించుటకు, అన్ని సంస్థల్లో ర్యాంపులు నిర్మాణమే గాక అచట దివ్యాంగులు ఉపయోగించుకునే మూత్రశాలలు, వీల్ చైర్ లు ఏర్పాటు చేయడానికి ఈ చట్టం వీలు కల్పించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించడానికి స్వయం ఉపాధి పథకం కింద 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతున్నది ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికను జోడించి అనేక అభివృద్ధి చెందిన ఉపకరణాలను కూడా అందజేయడం జరుగుతున్నది.

# రాజకీయ అనుభవశాలి కృపలానీ



ఆచార్య జె.బి. కృపలానీ (1888-1982) సుప్రసిద్ధ భారతీయ రాజకీయ నాయకుడు, గాంధేయవాది, సోషలిస్టు, పర్యావరణవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, చరిత్రకారుడు, పండితుడు, ఉపాధ్యాయుడు, రచయిత, మహాత్మాగాంధీ తొలి సహచరులు. గాంధీకి అత్యంత సన్నిహితులలో ఒకనిగా పేరు గాంచారు. 1947 భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్షునిగా ఉన్నారు. 1951, 1957, 1963, 1967లో లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. కృపలానీ ఆపద్ధర్మ భారత ప్రభుత్వము (1946-1947) లోనూ, భారత రాజ్యాంగ సభలోనూ పనిచేశారు. ఆచార్య కృపాలనీ నాటి సింధు (నేటి పాకిస్తాన్) ప్రాంతంలోని హైదరాబాదులో 1888లో జన్మించారు.అతని పూర్వీకులు గుజరాతీ, సింధీ సంతతులకు చెందినవారు. కరాచి డి.జె.సైన్సు కళాశాలలో, ఆయన రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటున్నందుకు కళాశాల నుంచి బహిష్కరించారు. కృపలానీ పూణేలోని ఫెర్గూసన్ కాలేజీ నుండి చరిత్ర, ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేసి 1912 లో బోధన ప్రారంభించారు. గాంధీ దక్షిణ ఆఫ్రికా నుండి వచ్చిన తరువాత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులుగా ఉన్న సమయం లోనే ఆయనకు మొదటి సారి గాంధీని కలిశారు. గాంధీని కలిసిన తరువాత కృపాలని కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుజరాత్, మహారాష్ట్ర, బీహార్లలో గాంధీ ఆశ్రమాలలో పని చేశారు. కృపలానీ 1920వ దశకపు తొలి నాళ్ళలో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. గుజరాత్, మహా రాష్ట్ర లోని గాంధీ ఆశ్రమాలలో సంఘ సంస్కరణ , విద్యా సంబంధ విషయాలపై కృషి చేశారు. ఆ తరువాత ఉత్తర భారత దేశంలోని బీహార్ , సంయుక్త రాష్ట్రాలలో అదే తరహా ఆశ్రమాలు స్థాపించి బోధించడానికి వెళ్ళారు. పౌర నిరసనోద్యమం లోనూ , ఇతర అనేక చిన్న సందర్భాలలోనూ బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలను నిర్వహించిన, ఉద్రేకపూరిత సాహిత్యాన్ని ప్రచురించిన అనేక సందర్భాలలో కృపలానీ జైలుకు వెళ్ళారు. 1922 నుండి 1927 వరకు గాంధీ స్థాపించిన అహ్మదాబాద్‌లోని గుజరాత్ విద్యాపీఠ్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఆచార్య అనే బిరుదును పొందారు. కృపలానీ అఖిల భారత కాంగ్రెసు కమిటీలో చేరి 1928-29లో దాని ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఒక దశాబ్దము పైగా కాంగ్రెస్ పార్టీ అత్యున్నత స్థాయి కార్య కలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమ నిర్వహణలో ప్రధానపాత్ర పోషించారు.1934-1935 మధ్య కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కూడా పని చేశారు. తరువాత 1946 లో పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సైద్ధాంతికంగా వల్లభ్ భాయి పటేల్‌తోనూ, జవహర్ లాల్ నెహ్రూ తోనూ విరుద్ధముగా ఉన్నప్పటికీ, కృపలానీ 1947లో భారత స్వాతంత్ర్యానికి అటునిటు క్లిష్టమైన సంవత్సరాలలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1948 జనవరిలో గాంధీ హత్య తర్వాత, అన్ని ప్రభుత్వ నిర్ణయాలలో పార్టీ యొక్క అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకోవాలన్న కృపలానీ కోరికను నెహ్రూ తోసిరాజన్నారు. నెహ్రూ, పటేల్ మద్దతును కూడగట్టుకొని, "పార్టీకి విస్తృతమైన మార్గదర్శకాలు, మూలసూత్రాలను నిర్దేశించే అధికారము కలిగి ఉన్నా, ప్రభుత్వ దైనందిన వ్యవహారాలలో కలుగ జేసుకొనే అధికారాన్ని పార్టీకి ఇవ్వలేమని" కృపలానీకి సమాధాన మిచ్చారు. సదరు పూర్వ ప్రమాణమే ఆ తర్వాత దశాబ్దాలలో ప్రభుత్వము , పాలక పార్టీ యొక్క సంబంధానికి కేంద్ర హేతువు అయ్యింది.గాంధీ ఆశయమైన గ్రామ స్వరాజ్యానికి తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణతో కాంగ్రెస్ పార్టీని విడిచి, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ సంస్థాపకుల్లో ఒకరైనారు. ఆ పార్టీ ఆ తరువాత సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమై ప్రజా సోషలిస్టు పార్టీగా అవతరించింది.కృపలానీ తన రాజకీయ శేష జీవితమంతా ప్రతిపక్షము.లోనే గడిపారు. 1938 నుండి ఆయన భార్య సుచేతా కృపలానీ, కాంగ్రేసు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రివర్గములో అనేక మార్లు మంత్రి పదవులతో సహా అనేక ఉన్నత పదవులు పొందారు. ఆమె దేశము లోనే మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉత్తర ప్రదేశ్ లో ప్రమాణ స్వీకారం చేశారు. కృపలానీ 1963 ఆగస్టులో భారత - చైనా యుద్ధం ముగియగానే నెహ్రూ ప్రభుత్వముపై లోక్ సభలో మొట్ట మొదటి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. సమాజిక, పర్యావరణ విషయాలపై పనిచేస్తూ కృపలానీ జీవితాంతము నెహ్రూ, ఇందిరల పాలనా, విధానాల విమర్శకునిగా మిగిలి పోయారు. క్రియాశీలక ఎన్నికల రాజకీయాల్లో కొనసాగుతూనే, కృపలానీ క్రమేణ రాజకీయ నాయకుడిగా కంటే కమ్యూనిస్టుల ఆధ్యాత్మిక గురువుగా పరిణతి చెందారు. ముఖ్యంగా వినోబా భావేతో పాటు కృపలానీని అంతరించి పోతున్న గాంధేయవాదుల వర్గానికి నాయకులుగా భావిస్తారు. 1970లలో వినోభా భావేతో పాటు ఈయన అనేక పరిరక్షణ , సంరక్షణా కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కూతురు ఇందిరా గాంధీ పాలనలను విమర్శించారు. ఆయా పాలనకు గ్రామీణ గణతంత్రాల, గాంధేయ ఆదర్శానికి విరుద్ధంగా ఉందని భావించారు.1972-73లో, కృపలానీ, జయ ప్రకాశ్ నారాయణ్‌లు ఇందిరా గాంధీ పాలన నియంతృత్వంగా, ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ఉందని భావించి, ప్రధాని ఇందిర పాలనపై నిరసన ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ యంత్రాగాన్ని ఉపయోగించు కుందన్న అభియోగము న్యాయ స్థానములో నిర్ధారణ కావడంతో, రాజకీయ ప్రతిపక్షాలు ఆమెకు వ్యతిరేకంగా మరింత ముందుకు సాగాయి. జయప్రకాష్ నారాయణ్‌తో పాటు, 1972-73లో ఇందిరా గాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అహింసాత్మక నిరసన, శాసనోల్లంఘనను కోరుతూ కృపాలాని భారతదేశంలో పర్యటించారు. 1975లో అత్యయిక పరిస్థితిని విధించినప్పుడు పెద్ద ఎత్తున నిరసన రేపడానికి కారకులు అయినారనే నెపంతో, జూన్ 26, 1975 రాత్రి అరెస్టు చేయబడిన మొట్టమొదటి ప్రతిపక్ష నాయకుల్లో 80 యేళ్ళు పైబడిన కృపలానీ ఒకరు. ఎమర్జెన్సీ అంతం కావడం, 1977 ఎన్నికల్లో జనతా పార్టీ గెలుపొంది స్వాతంత్ర్యానంతరం మొట్ట మొదటి సారిగా ఒక కాంగ్రెసేతర ప్రభుత్వం నెలకొల్పటం చూడటానికి కృపలానీ జీవించే ఉన్నారు. లోహియా గాంధేయ తత్వ శాస్త్రాలపై కొన్ని పుస్తకాలు కూడా రాశారుబీ "అహింసా విప్లవం", "గాంధేయ వే", "ది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్", "ది ఫేట్ఫుల్ ఇయర్స్", "ది పొలిటిక్స్ ఆఫ్ చక్ర", "ది ఫాదర్ ఆఫ్ ది కాంగ్రెస్", "గాంధేయ విమర్శ" ముఖ్యమైనవి. కృపలానీ 94 యేళ్ళ వయసులో 1982, మార్చి 19న మరణించారు.